డి. కామేశ్వరి

# తల్లికి విలువ?

"ఏమండోయ్ మీ అమ్మగారేమిటి పెట్టె బేడా సర్దేస్తుంది. ఎక్కడికన్నా వెడ్తున్నట్టు మీకేమన్నా చెప్పిందావిడ?" తాపీగా పేపరు చూస్తున్న శేషగిరి దగ్గరికి గాభరాగా వచ్చి అంది పద్మ.

పేపరులోంచి తలెత్తి "నాకేం చెప్పలేదే! ఎక్కడికి వెళ్తుంది. అడగకపోయావా?" అన్నాడు.

"ఏమో. నాకేం తెలుసు,. ఆవిడ నాకేం చెప్పలేదు. మీరెళ్లి అడగండి." మొహం మాడ్చుకుంటూ అంది.

"ఏం మళ్ళీ ఇద్దరూ ఏమన్నా గొడవపడ్డారా?" భార్యవంక అసహనంగా చూశాడు.

"ఏం వుంది చెప్పడానికి. నిన్న ఏదో మాటామాటా అనుకున్నాం. ఇదేమన్నా మాకు కొత్తా" తనని తాను సమర్థించుకుంటూ అంది.

"వెళ్లి అడగండి ఆవిడ చాలా సీరియస్‌గా అన్నీ సర్దేస్తూంది. మన బుజ్జి అడిగితే 'ఇంట్లోంచి వెళ్లిపోతున్నానురా నాన్నా' అందిట"

ఈలోగా బుజ్జి, శ్రావణి అక్కడికి పరిగెత్తి వచ్చారు. "అమ్మా, నాన్న మామ్మ వెళ్లిపోతూంది" వగురుస్తూ అన్నారు.

శేషగిరి లేవబోయే లోపలే "శేషూ, బాబూ నేను వెడ్తున్నానురా. ఇవాళ ఆదివారం మీరింట్లో వున్నారని, ఈరోజు పెట్టుకున్నాను ప్రయాణం"

"ఏమిటమ్మా ఎక్కడకి ప్రయాణం, కుసుమ దగ్గరికా, అదేమన్నా నిన్ను రమ్మనమని రాసిందా. నాకు చెప్పనేలేదు నువ్వు" అన్నాడు.

"కుసుమ దగ్గరకి కాదు, ఇకమీదట నేను ఎవరికి భారం కాకుండా నా పొట్టకోసం తిప్పలు నేనే పడాలని నిర్ణయించుకున్నాను"

శేషగిరి మొహం నల్లబడింది. పద్మ గిల్టీగా చూసింది. "ఏమిటమ్మా ఇది. ఏం జరిగిందని ఇలా అంటున్నావు" కాస్త కోపంగా అన్నాడు.

"ఏం జరుగుతుంది నాయనా. ఒకరోజు భాగోతం అయితే చెప్పుకోవచ్చు. నాకూ చీము, నెత్తురువుంది. మానాభిమానాలున్నాయి. ఎంత మీమీద ఆధారనపడి

బతుకుతున్నా నాకు ఊరికే మీరేం తిండి పెట్టడంలేదు. రోజంతా నడుం వంచకుండా చాకిరిచేసి వండివార్చి, మీ అందరికి క్యారియర్లు కట్టిచ్చి, మీ పిల్లలకి ఆయాలా, ఈ ఇంటి కాపలా కుక్కలా పడుండి మీరొచ్చేవరకు మీ పిల్లల అల్లరి ఆగడం భరిస్తూ, బతిమాలి బామాలి తినిపించి, తాగించి, చదివించి ఇదంతా నా ఇల్లనుకుని, నా కొడుకని నా మనవలనుకుని చేశాను ఏడాదిగా.

నాయనా నీ ఇంట్లో చేసే ఈ చాకిరికి ఎవరన్నా కళ్లకద్దుకుని ఇంట్లో వుంచుకుని తిండిపెట్టి కనీసం ఐదొందలు ఇస్తారు. మీకు నేనేదో గుదిబండనై, ఊరికే తినిపోతున్నట్టు, భారమై ఎందుకు వుండడం బాబూ, కన్నతల్లి అన్న గౌరవం, అభిమానం లేకపోయినా, మనకింత చేస్తూంది అన్న భావన మీకు లేకపోయినపుడు నేనెందుకు పడుండాలి.

ఈ చాకిరి ఎక్కడ చేసినా నా రోజులు దివ్యంగా వెళ్లిపోతాయి. కన్నతల్లి స్థానం నాకీ ఇంట్లో లభించనపుడు కసుర్లు, విసుర్లు తింటూ మీకు భారమై వుండరాదని నిర్ణయించుకున్నాను. నా చాకిరీకి విలువకట్టి డబ్బిచ్చేచోట వెతుక్కుని వెడుతున్నాను" సరస్వతమ్మ స్థిరంగా అంది.

పద్మ మొహం వివర్ణమయింది. గాభరాగా శేషగిరి వంక చూసింది. భార్య వంక అంతా నీవల్లే అనుభవించు అన్నట్టు చూసి తల్లిని అనునయిస్తున్నట్టు "ఏమిటమ్మా అత్తాకోడలు మాటమాట అనుకోడం లోకంలో కొత్తా, అంత మాత్రానికి ఇల్లువదిలి వెడతానంటావేమిటి, నీవరస బాగులేదు" కాస్త కోపంగా అన్నాడు.

"అవున్నాయనా నా వరస బాగుండదు. కాస్త మాటలకి ఎవరూ ఇల్లొదలరు బాబూ. నాకూ మనసనేది వుంది. ఏదన్నా హద్దు దాటినపుడే తెగింపు వస్తుంది. ఆఫీసుకి వెళ్ళేముందు అరటిపళ్లు లెక్క చూసుకుంటుంది. పాలగిన్నె చూసుకుంటుంది నీ భార్య., నేనేదో ఇంట్లోపడి అందినంత దోచుకుతింటున్నానని పిల్లిమీద, ఎలకమీద పెట్టి అంటుంది.

నాదీనోరే, నాదీ కడుపే. ఓ పండు, ఓ లడ్డు తినే స్వాతంత్ర్యం కూడా లేని ఈ ఇంట్లో నాకేం వుందని వుండాలి. శేషూ ఊరికేచేసే చాకిరికి విలువ వుండదు. నేను వెళ్లాక జీతం ఇచ్చి పెట్టుకొంటేగాని నేను మీకేం చేశానో అర్థం కాదు.

పరాయిచోట నాకు నచ్చితే చేస్తాను లేదంటే ఇంకో ఇల్లు చూసుకొంటాను. ఓ గుడికెళ్లాలన్నా, ఓ పండు కొనుక్కొని తినాలన్నా, ఆడపిల్లకి పసుపు కుంకం ఏడాదికోసారి పెట్టుకోవాలన్నా నిన్నే దేబిరించుకుని కసిరించుకొనే బతుకు నాకు వద్దు. కష్టపడి సంపాదించుకుంటాను. తింటాను.

నా పిల్లలని చూసుకోవాలన్న రోజున మీ ఇళ్లకి వచ్చి ఓ పూట వుండి వెడతాను. ఈ అస్వాతంత్ర్యం బతుకుకంటే పరాయి ఇంట్లో వంటామెగా బతకడంలో నా ఆత్మగౌరవం నిలుపుకోవాలని నిర్ణయించుకున్నాను." సరస్వతమ్మ ఖచ్చితంగా అంది.

భార్యాభర్తలు మొహాలు చూసుకున్నారు. "కన్నకొడుకుండగా ఇక్కడ అక్కడ వంటలు చేసుకుంటావా, అందరూ మా మొహాన ఉమ్మేయాలనా, లోకం అనేది నన్నేగా' ' ఉక్రోషంగా అన్నాడు.

"శేషూ లోకం ఏమంటుంది. ఇరుగుపొరుగు అనుకుంటే నాలుగురోజులను కుంటారు.ఈ రోజుల్లో ఎవరికివారే. ఎవరి గురించి పట్టించుకునే కోరిక తీరిక ఎవరికున్నాయి. లోకం కోసం నా ఆత్మాభిమానం ఇంకా బలిపెట్టి బతకను"

"అయితే పని కూడా చూసుకున్నావన్నమాట అపుడే. ఎక్కడ? ఎవరింటికెడుతున్నావు వంటమనిషిగా?"వ్యంగ్యంగా అడిగాడు.

"ఎవరో పిల్లల తల్లి. మీలాగే ఉద్యోగస్థులు, ఇద్దరు పిల్లలతో అవస్థపడుతూంది. మీలాంటి పెద్దదిక్కు కావాలి మామ్మగారు ఎవరన్నా ఇంట్లోకి అంది. కన్నతల్లి విలువ తెలియని మీ ఇంట్లో పడుండేకంటే కన్నతల్లిలా ఆదరిస్తానన్న ఆ చోట నాకు నచ్చిం దని..."

శేషగిరి భార్యవంక కోపంగా చూశాడు. ఇదంతా నీ వల్లే అనుభవించు అన్నట్టు చూశాడు. పద్మ తల దించుకుంది. శేషగిరి విసవిస గదిలోకి వెళ్లాడు.

"పద్మా ఇలారా" గట్టిగా పిల్చాడు.

"వెళ్లు,. ముందెళ్లి అమ్మకి క్షమాపణ చెప్పు. ఆవిడ ఇంట్లోంచి వెడితేఆవిడన్నట్టు నష్టం ఆవిడకి కాదుమనకు. ఆవిడ వెడితే మన పాట్లు కుక్కలు కూడా పడవు. బుద్ధి వచ్చింది గౌరవంగా చూస్తానని చెప్పు. ఇంకా కాదంటే కాళ్లు పట్టుకో. అలా చెయ్యనంటే నీ కర్మ. ఎన్ని వందలిచ్చినా నీకిలా చాకిరిచేసే మనిషి దొరకదు." అన్నాడు.

పద్మ అప్పటికే భయపడింది. అత్తగారు లేకుండా ఇల్లు ఎలా మానేజ్ చేయాలన్న ఆలోచనే భయం పుట్టించగా. అత్తగారిని క్షమించమనడం మినహా దారిలేదన్నది ఆమెకీ తట్టింది. నల్లబడిన మొహంతో హాలులోకి వెళ్లింది. "అత్తయ్యా పొరపాటయింది. క్షమించండి. మీరింత కోపం తెచ్చుకుంటారని మమ్మల్ని వదిలి వెడతారని అనుకోలేదు., ఇక ముందు ....' ఏదో చెప్పబోయింది.

"వద్దమ్మా. నీ క్షమాపణలు కాదునాకు కావల్సింది. నాకు నా సంపాదన కావాలి. నా కాళ్లమీద నేను నిలబడ్డాను, ఎవరికి బరువు కాకుండా అన్న తృప్తికావాలి. ఆయన

పోయిన ఈ ఏడాదిలో నాకంటూ ఏమీ లేకుండా కొడుకు మీద ఆధారపడడం అంటే ఏమిటో అర్థం అయింది.

"ఉద్యోగం చేసే చదువు నాకులేదు. నాకు వచ్చిన విద్య వంట. అది చేసుకుంటూ ఇంకా వీలయితే నలుగురి చిన్నపిల్లలకి చదువు చెప్పుకుంటూ, ఇంకా కావలిస్తే ఊరగాయలు, అప్పడాలు అమ్ముకుంటూ నయినా నా బతుకు నేను గౌరవంగా బతకచ్చు అన్న ఆలోచనే ఈ ఇంట్లోంచే వెళ్లగలిగే ధైర్యాన్నిచ్చింది. నాకు కావల్సింది జీతం ఇచ్చి పెట్టుకునే వారు కావాలి. నువ్వు ఆ జీతం ఇస్తానంటే వుంటా. లేదంటే ఇల్లు చూసుకున్నాను"

"అంటే, నీవింట్లో ఉండాలంటే మేమూజీతం ఇవ్వాలా" అన్నాడు శేషగిరి.

"అవును నాయనా ఊరికే చాకిరికి విలువ ఎలా ఉండదో, ఊరికే తినే తిండికీ గౌరవం ఉండదు. 'తల్లివిలువ' మీలాంటివారికి ఎలాగూ తెలియదు. కనీసం 'తల్లికి విలువ' కట్టయినా డబ్బిచ్చి రుణం తీర్చుకోండి' సరస్వతమ్మ నవ్వి అంది.

"అంతా ఏమనుకుంటారన్న బాధ నీకులేదా?"

"నాలాంటి తల్లులు ఇకముందు నన్ను చూసి నేర్చుకుని బాగుపడతారు. కొడుకుల మీద ఆధారపడే తల్లులు నా సంగతి విని పాఠం నేర్చుకుంటారులే నాయనా" అదోలా నవ్వింది సరస్వతి వెళ్లడానికి పెట్టెపట్టుకుని.

శేషగిరి గాభరాగా ముందుకి వచ్చి పెట్టెలాగి "అలాగే డబ్బిస్తా. రా లోపలికి."

"ఒక నెల అడ్వాన్సు ముందుగా ఇయాలి సుమా" అన్నదామె.

శేషగిరి, పద్మ నిస్సహాయంగా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

◆ స్వాతి మంత్రి

కథా నిలయం
5448
శ్రీకాకుళం